## క్లుప్తంగా

### కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 70, పచ్చిమిర్చి 60–70 , బెండ 45, కాకర 60, దొండ 40, దోస 40, ఆలు 25, చామ 50, కీర 30, బీర 50, వంకాయ 40, గోకర 45, బీన్స్ 80, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 70–80, ఉల్లి 100 (4 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30, అల్లం 200–250, వెల్లుల్లి 200.

### రహమతుల్లాకు పీహెచ్‌డీ



రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థి రహమతుల్లాకు సోమవారం పీహెచ్‌డీని ప్రకటించారు. డాక్టర్ హసనుద్దీన్ అహ్మద్ నిగరీ కా తహ్కీకీ ఓ తంఖీదీ జాయేజా' ( డాక్టర్ హసనుద్దీన్ అహ్మద్ యొక్క అనువాదాలపై పరిశోధన ఆధారిత, విమర్శనాత్మక సమీక్ష' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు. అనువాద విభాగం ప్రొఫెసర్ మహ్మద్ ఖలీద్ ముబాషిర్–ఉజ్–జాఫర్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు.

### కరోనా పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 9 మందికి కొవిడ్ ర్యాపిడ్ అంటీజన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా 11 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

### హెచ్‌ఐసీసీలో జైపూర్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నటి వర్ష, ఊర్మిళా చౌహాన్ తదితరులు

మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో సోమవారం జరి జైపూర్ ఎగ్జిబిషన్‌ను నటి వర్ష నిర్వాహకులతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో నటి కామాక్షి భాస్కర్, తెలంగాణ 2023 మిస్ ఇండియా ఊర్మిళా చౌహాన్, జరి జైపూర్ ఎగ్జిబిషన్ నిర్వాహకులు రిషబ్ సోకియాలు పాల్గొన్నారు. చీరలు, లెహంగాలు, కుర్తీస్, సల్వార్‌లతో పాటు మరిన్ని ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

### విద్యార్థుల ధర్నా

జిన్నారం (పటాన్‌చెరు): సమయానికి ఆర్టీసీ బస్సులు రావటం లేదని సోమవారం విద్యార్థులు ధర్నా చేశారు. ఈ ధర్నాకు ఏబీవీపీ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మద్దతు తెలిపారు. గుమ్మడిదలకు ఉదయం సమయంలో బస్సులు టైంకు రాకపోవటంతో తాము కాలేజీలు, పాఠశాలలకు వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని, బస్సుల సంఖ్యను పెంచటంతో పాటు సమయ పాలన పాటించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. పోలీసులు కల్పించుకొని ధర్నాను విరమింపజేశారు.

### ఉచిత కంప్యూటర్ కోర్సులు

పటాన్‌చెరు: ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ కోర్సులు అందుబాటులోకి రానున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. జీవీఆర్ ఫ్రీ స్కిల్స్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా సీ,సీ ప్లస్ ప్లస్, పైథాన్, జావా, వెబ్ టెక్ తదితర అంశాల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. తొలివిడతగా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతిరోజు సాయంత్రం ఉచితంగా క్లాసులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాల కోసం.. ఈశయ్య (8978064011), శ్రవణ్ కుమార్ (91773 78737) లను సంప్రదించాలని కోరారు. ఈ సదవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### ప్రభుత్వాసుపత్రిలో ఆధునిక వైద్యసేవలు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వాసుపత్రుల్లో ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన న్యూ బార్న్ సస్టైనబుల్ యూనిట్‌ను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటైన వార్డులో నవజాత శిశువులకు తొలి రోజుల్లో వచ్చే వైద్య సమస్యలకు అత్యాధునిక వైద్యం లభిస్తుందని తెలిపారు. ఇటీవల సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

# జీవ వైవిధ్యాన్ని పెంపొందించాలి

ఎఫ్‌డీసీ వైస్ చైర్మన్, ఎండి.డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి



బొటానికల్ గార్డెన్‌లోని చెరువులో చేప పిల్లలను వదులుతున్న దృశ్యం

గచ్చిబౌలి: జీవ వైవిధ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని టీఎస్‌ఎఫ్‌డీసీ వైస్ చైర్మన్,ఎండి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పలు చెరువులలో దాదాపు 20 వేల చేప పిల్లలను వదిలామని ఆయన పేర్కొన్నారు. చిలుకూరు ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో పెద్ద చెరువు, చిన్న చెరువుల్లో 10 వేల చేప పిల్లలను వదిలామన్నారు. బొటానికల్ గార్డెన్‌లోని కుంటలో 4 వేలు, వర్చువల్ సఫారీ పార్క్‌లో 3 వేలు, పాలపిట్ట పార్క్ చెరువులో మూడున్నర వేల చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. చేపలు ఉంటేనే పక్షులు పార్క్‌లను ఆవాసాలుగా మార్చుకుంటాయని దీంతో జీవ వైవిధ్యం పెంపొందించేందుకు వీలుంటుందన్నారు. చిలుకూరు ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో ఆసియా కోయెల్, మాల్కోవా, అయోరా, బ్లాక్ డోన్గో, వుడ్‌సాండ్ పైపర్, శిక్రా తదితర పక్షులు, ఎర్ర చందనం, కదంబ, నేరేడు, వెదురు, మద్ది, మహాగని వంటి చెట్లు ఉన్నాయని తెలిపారు.

# 'ఎస్కీ'లో 'ఈ–20 సమ్మిట్' పోస్టర్ ఆవిష్కరణ

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ)లో ఈ–20 సమ్మిట్, అంతర్జాతీయ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. 'ఎస్కీ' ప్రాంగణంలో ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా(ఐఈఐ), ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్(ఐఎస్‌ఏ) సంయుక్త ఆధ్వర్యంలో జీ–20 దేశాల సమావేశాల్లో భాగంగా 'పారిశ్రామిక రంగంలో నికర జీరో దిశగా ముందుకు సాగడం' అనే అంశంపై ఈ–20 సమ్మిట్, అంతర్జాతీయ సదస్సును ఈనెల 24, 26వ తేదీలలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సమావేశపు పోస్టర్‌ను ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఐఈఐ నూతన అధ్యక్షుడు శివానంద్‌రాయ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక రంగం మరింత అభివృద్ధి దిశగా పయనించేలా ప్రోత్సహించడం, సమగ్ర వ్యూహాలు, తక్కువ కార్బన్ విద్యుత్, విద్య, ప్రజల ప్రమేయం, ప్రపంచ సహకారం వంటి వివిధ అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐఈఐ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ జేసీ సింఘాల్, సమ్మిట్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ పి సూర్యప్రకాశ్, తెలంగాణ స్టేట్ సెంటర్ ఐఈఐ చైర్మన్ ఆర్ బ్రహ్మారెడ్డి, ఎస్కీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# బిందుశ్రీ ఆత్మహత్య కేసులో ఇంటి యజమాని రిమాండ్



పూర్ణచంద్రరావు

గచ్చిబౌలి: పనిమనిషి బిందుశ్రీ ఆత్మహత్య కేసులో ఇంటి యజమాని ఆచర్ల పూర్ణచంద్రరావును రిమాండ్‌కు తరలించిన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిందుశ్రీ కుటుంబం, హోం థియేటర్స్ బిజినెస్ చేసే పూర్ణచంద్రరావులది కాకినాడే కావడంతో పాత పరిచయం ఉంది. 2017 నుంచి పూర్ణచంద్రరావు ఇంట్లో పనిచేస్తూ పిల్లలకు కేర్ టేకర్‌గా అక్కడే ఉంటోంది. ఇద్దరి మధ్య సన్నిహిత్యం పెరిగి సహజీవనానికి దారితీసింది. ఇంట్లోనే ఉంటున్న పూర్ణచంద్రరావు భార్యకు, బిందుశ్రీకి తరచు గొడవలు జరుగుతున్నాయి. శనివారం తెల్లవారుజామున మద్యం సేవించిన బిందుశ్రీ హాల్‌లో కేకలు వేయడంతో పూర్ణచంద్రరావు భార్య బయటకు వచ్చింది. ఇద్దరు గొడవ పడటంతో పూర్ణచంద్రరావు జోక్యం చేసుకున్నాడు. మాటామాట పెరిగి బిందుశ్రీపై చేయి చేసుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన బిందుశ్రీ 21వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఫిల్మ్ చాంబర్‌లో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తున్న బిందుశ్రీ తనకు పరిచయమైందని, రైటర్‌గా తనకు సభ్యత్వం ఉందని నిందితుడు పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. ఇదిఇలా ఉంటే ప్లాట్ ఇప్పిస్తాననడంతో బిందుశ్రీ కుటుంబసభ్యులు కొంత డబ్బు ఇచ్చినట్టు పోలీసుల విచారణలో తెలిసినట్టు సమాచారం. సినిమాలో అవకాశం ఇస్తానని మోసం చేసినట్టుగా వస్తున్న వార్తల్లో నిజం లేదని సీఐ మహేష్ పేర్కొన్నారు. నిందితుడిపై ఐపీసీ 306 సెక్షన్ కింద కేసు నమోదు రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

### వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన సునీల్ మెహ్రా

హఫీజ్‌పేట్ : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఝార్ఖండ్ రాష్ట్రం దేవ్‌గఢ్ జిల్లా హరిరాక గ్రామానికి చెందిన సునీల్ మెహ్రా (25) సంవత్సరం క్రితం గోపన్‌పల్లి తండా హానర్ హోమ్స్‌కు వచ్చి కూలీ పని చేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున 2.30 గంటలకు గోపన్‌పల్లి తండా వద్ద రోడ్డుపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది తీవ్ర గాయాలైన సునీల్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చందానగర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య నలుగురు పిల్లలు ఝార్ఖండ్‌లో ఉంటున్నారు. సునీల్ మద్యంకు బానిసై తరచుగా మద్యం సేవించి రోడ్లపై తిరుగుతుండేవాడని తోటి వారు పోలీసులకు వివరించారు.

### సీసీఎస్ పోలీసు సిబ్బందికి అవార్డులు

రాయదుర్గం: సీసీఎస్ పోలీసు సిబ్బంది పనితీరుతో సైబరాబాద్ పరిధిలో క్రైమ్ డిటెక్షన్ రేటు 80 శాతానికి పైగా ఉందని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో సైబరాబాద్ పరిధిలోని సీసీఎస్ బాలానగర్ జోన్, శంషాబాద్, మాదాపూర్, మేడ్చల్ జోన్లకు చెందిన పోలీసు సిబ్బంది ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని అభినందించి రివార్డులను అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సీసీఎస్, లాఅండ్ ఆర్డర్ వింగ్స్ ఒకదానితో మరొకటి సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డీసీపీలు కల్మేశ్వర్ సింగెన్వర్, సందీప్, ఏడీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

### ఘనంగా బోనాలు

శేరిలింగంపల్లి: తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల వేడుకలు భెల్ ఎంఐజీ కాలనీలో సోమవారం నిర్వహించారు. స్థానిక లలితపోచమ్మ ఆలయంలో మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు వైభవంగా సాగింది. ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు సింధు ఆదర్శ్‌రెడ్డి, రాగం నాగేందర్‌యాదవ్, జగదీశ్వర్‌గౌడ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

### ప్రత్యేక పూజలు

రాయదుర్గం: శ్రావణమాసం సోమవారాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని జీపీఆర్‌ఏ క్వార్టర్స్ ఆలయంలో రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామికి అర్చనలు, అభిషేకాలు చేశారు. భారీగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

### రౌడీ షీటర్ దారుణహత్య

పాత కక్షలే కారణమంటున్న పోలీసులు



నదీమ్ హుస్సేన్ (ఫైల్)

మాదాపూర్: రౌడీషీటర్ దారుణహత్యకు గురైన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. నదీమ్ హుస్సేన్ (30) బోరబండకు చెందిన రౌడీషీటర్. ఆదివారం అర్ధరాత్రి మాదాపూర్ పోలీస్ లిమిట్స్ భాగ్యనగర్ కో ఆపరేటివ్ సొసైటీ శివారు ప్రాంతంలో హత్యకు గురైనట్టు తెలిపారు. గతంలో సనత్‌నగర్ మర్డర్ కేసులో అతనిపై 2019లో రౌడీషీట్‌ను ఓపెన్ చేసినట్టు తెలిపారు. హత్యకు పాతకక్షలే కారణమని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### అదనపు నిధులు కేటాయించాలి

జలమండలి ఎండీ దానకిశోర్‌ను కలిసిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ దానకిశోర్‌ను ఎమ్మెల్యే గాంధీ సోమవారం కలిశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పలు సమస్యలు, పరిష్కరించాల్సిన అంశాలు, అభివృద్ధి పనులపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లిలో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కాలనీల్లో నీటి సమస్య, అసంపూర్తి మంచినీటి పైప్‌లైన్ పనులకు అదనపు నిధులు కేటాయించాలని కోరారు. మంచినీటి సరఫరా సమయం పెంచాలని కోరారు. ఈ అంశాలపై దానకిశోర్ సానుకూలంగా స్పందించారు. సీవరేజ్ సమస్యల పరిష్కారానికి దశలవారీగా నిధులు కేటాయించేందుకు అంగీకరించారని తెలిపారు.

### రక్తదాన శిబిరం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. హెచ్‌సీయూలోని ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ఆధ్వర్యంలో యూనివర్సిటీలోని హెల్త్ సెంటర్‌లో 'మేరీ మాటి.. మేరా దేశ్' కార్యక్రమంలో భాగంగా స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్, హెల్త్‌సెంటర్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, మంజీరా సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీనిని హెచ్‌సీయూ హెల్త్ సెంటర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవీంద్ర కుమార్ ప్రారంభించారు. అనంతరం హెచ్‌సీయూ విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు ఔత్సాహికులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ వి శ్రీనివాసరావు, హెల్త్ సెంటర్ డాక్టర్లు అనుపమ, రాజశ్రీ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ భీంసింగ్, డాక్టర్ రాణిరత్నప్రభ, డాక్టర్ వరలక్ష్మీ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు మహేందర్ రెడ్డి, వెంకటదాసు, విజయకుమార్, ఇతర బృందం, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# కళలు సమాజాన్ని జాగృతం చేస్తాయి.

భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



మాదాపూర్: కళలు వినోదాన్ని మాత్రమే కాదు విజ్ఞానాన్ని అందిస్తాయని భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో సోమవారం కుమారి యెర్నేని లేఖ భరతనాట్య అరంగేట్రం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ భారతదేశం కళల కాణాచి అని అన్నారు. కళలు మన పెద్దలు మనకు అందించిన విలువైన కానుకలని వాటిని ముందు తరాలకు అందించాలని తెలిపారు. ఇలాంటి భారతీయ కళలను పాఠ్యాంశాలలో భాగం చేసి విద్యార్థులకు నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఆధునిక కాలంలోను సాధన చేస్తు కుమారి యెర్నేని లేఖ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అభినందించారు. పాఠాలను కళలతో కలిపి నేర్పించడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత మరింత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ దీపికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఐటీ పార్కులు, ఆఫీసుల్లో ప్రీ స్కూల్స్ అవసరం

9వ నిజాం రౌనక్‌యార్‌ఖాన్



కార్యక్రమంలో పాల్గొన్న 9వ నిజాం రౌనక్‌యార్‌ఖాన్ తదితరులు

రాయదుర్గం: ఐటీ పార్కులు, ఆఫీసుల్లో ప్రీ స్కూల్స్ అవసరమని 9వ నిజాం రౌనక్‌యార్‌ఖాన్ పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని క్యూసిటీలో 'మై స్కూల్ ఇటలీ' ప్రీ స్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మై స్కూల్ ఇటలీ యూరోపియన్ న్యూరోసైంటిఫిక్ స్కూల్ ప్రపంచంలో మొట్టమొదటిదన్నారు. మై స్కూల్ ఇటలీ పాఠశాల ఎండీ డాక్టర్ అపర్ణ వల్లూరు మాట్లాడుతూ హైదరాబాద్‌లో మూడు శాఖలు ఉన్నాయన్నారు. 5 ఏళ్ళ నుంచి పిల్లలకు రోబోటిక్స్, జిమ్నాస్టిక్స్ బోధించే ఏకైక పాఠశాల అని అన్నారు. చిన్నారుల వేషధారణలు విశేషంగా అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ చాప్టర్ చైర్మన్ అజయ్‌మిశ్రా, క్యూసిటీ జనరల్ మేనేజర్ మాల్తీ మోరిసెట్టి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య పోరాటంలో కవిత్వానిది గొప్పపాత్ర

మనూ వీసీ ప్రొ.ఐనుల్‌హసన్



రాయదుర్గం: స్వాతంత్ర్య పోరాట సమయంలో, ఉద్యమంలో అందరూ నిమగ్నమయ్యేలా ప్రజలను ప్రేరేపించడంలో కవిత్వం గొప్ప పాత్ర పోషించిందని మనూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా విశ్వవిద్యాలయంలోని హమీద్ లైబ్రరీలో సోమవారం 'భారత స్వాతంత్ర్య పోరాటం' అనే అంశంపై పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భిన్నాభిప్రాయాల మధ్య ఐక్యతను చాటే విభిన్న సమాజాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ మాట్లాడారు. కాగా 'భారత స్వాతంత్ర్య పోరాటం' అనే అంశంపై పుస్తక ప్రదర్శనలో మహిళల సేవలను హైలైట్ చేసే పోస్టర్లను కూడా ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఈనెల 18వ తేదీ వరకు నిర్వహిస్తారు. కార్యక్రమంలోలైబ్రేరియన్ డాక్టర్ అక్తర్ పర్వేజ్, పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.